సాక్షి ములుగు

బుధవారం । 18 । జూన్ । 2025



ఇల్లు లేని కుటుంబం ఉండొద్దు

రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా ఉండొద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. - 8లో▸



తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $35^0/26^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు రూరల్: నిరుద్యోగ యువత రేపు (19న) జిల్లాకేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దివాకర మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. టాస్క్ రీజినల్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ పొందిన టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ పొందిన టెన్త్, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన నిరుద్యోగ యువత ములుగు, వరంగల్, హైదరాబాద్‌లోని సాబిక్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్, టాటా స్ట్రీవ్, జస్ట్ డియల్, జహ్నవి కమ్యూనికేషన్, హెచ్‌బీడీ ఫైనాన్స్, షణ్ముక బయో ఆర్గానిక్స్, ముథూట్ మైక్రోఫిన్ లిమిటెడ్, శ్రీరాం ఫైనాన్స్‌తో పాటు ఇతర కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు టాస్క్ రీజినల్ కో ఆర్డినేటర్ సెల్ నంబర్ 9618449360లో సంప్రదించాలని తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత



ములుగు రూరల్: జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అంగన్‌వాడీలతో కలిసి జిల్లా కార్యాలయ అధికారి రాజ్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ తుల రవికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవని తెలిపారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఐసీడీఎస్ లాంటి కేంద్ర ప్రభుత్వ స్కీములను ప్రభుత్వ శాఖలుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మక్క, భవాని, సునీత, సుమంజలి తదితరులు పాల్గొన్నారు.

పోల్‌టాక్స్ రద్దుచేయాలని వినతి

భూపాలపల్లి అర్బన్: కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం విధిస్తున్న పోల్ టాక్స్‌ను రద్దుచేయాలని కోరుతూ కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వేశాల రమేష్‌బాబు మాట్లాడుతూ.. కేబుల్ ఆపరేటర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పనిచేస్తున్నారని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించి టాక్స్ రద్దుచేయాలని కోరారు.

మైనర్లతో వాహనాలు నడిపిస్తే చర్యలు

కాటారం: మైనర్లకు వాహనాలు ఇచ్చి పనులు చేయిస్తే సదరు వాహన యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ హెచ్చరించారు. కాటారం మండలం మేడిపల్లి పరిధిలోని బస్వాపూర్‌కు చెందిన బాలుడు మంగళవారం ట్రాక్టర్‌తో పని చేస్తుండగా పోలీసులు గుర్తించారు. ట్రాక్టర్ యజమాని వెన్నపురెడ్డి సమ్మయ్య, ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించడం, పనులు చేయించడం నేరమన్నారు. అలాంటి వారిని ఉపేక్షించబోమని పేర్కొన్నారు. మైనర్లతో పనులు చేయిస్తే బాలకార్మిక చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని డీఎస్పీ హెచ్చరించారు. వాహనాల యజమానులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు.

లక్ష్మారెడ్డి పల్లెలో వింత పాము



గణపురం: మండలంలోని లక్ష్మారెడ్డిపల్లెలో మంగళవారం సాయంత్రం వింత విషపాము దర్శనమిచ్చింది. లక్ష్మారెడ్డిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డుపై రెండు తలలతో ఎరుపు రంగుతో నల్లని కట్లతో గ్రామస్తులకు పాము కనిపించింది. కొందరు రక్త పింజర అని.. కాటు వేస్తే చాలా ప్రమాదమని అంటుండగా, మరికొందరు మాత్రం ఇది ఇప్పటివరకు చూడని పాము అని చర్చించుకుంటున్నారు.



జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాల భవనం

వసతులు అంతంతే!

జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో సౌకర్యాల లేమి

- ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఎన్‌ఎంసీ కొర్రీలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- వసతులు కల్పిస్తేనే ప్రవేశాలకు అనుమతి వచ్చే అవకాశం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లకు ఎన్‌ఎంసీ(నేషనల్ మెడికల్ కమిషన్) అడ్డంకులు తెలిపింది. ఈ మేరకు మెడికల్ కళాశాలలో నిబంధనల మేరకు వైద్య విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీలో అరకొర వసతుల మధ్య వైద్య విద్య కొనసాగిస్తున్నారు. వైద్య విద్యార్థులకు ల్యాబ్‌లు, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, అనుసంధాన ఆస్పత్రి, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉంచాలి. ఈ వసతుల కొరతను గుర్తించిన నేషనల్ మెడికల్ కమిషన్ సీరియస్ అయ్యింది. ఉమ్మడి జిల్లాలోని పలు వైద్య కళాశాలలతో పాటు ములుగు కళాశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది ప్రవేశాల లోపు కళాశాలలో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు వసతులు కల్పిస్తేనే ప్రవేశాలకు అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు షోకాజ్ నోటీసులపై సంజాయిషీ ఇచ్చేందుకు బుధవారం ఢిల్లీకి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్ వెళ్లనున్నారు.. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం నేడు (బుధవారం)తేలనుంది.



మెడికల్ కళాశాలలో హెమటాలజీ ల్యాబ్

ఏర్పాట్లలో నిమగ్నం

మెడికల్ కళాశాలలో నిబంధనల మేరకు ఏర్పాట్లు, తగిన వసతులు కల్పించేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది అడ్మిషన్లకు సుమారు 2 నెలల సమయం ఉండడంతో నిబంధనల మేరకు కళాశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లకు అనుమతి పొందేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.

మెడికల్ కళాశాలలో..

జిల్లాలో గతేడాది ప్రారంభమైన మెడికల్ కళాశాలలో ప్రస్తుతం 50 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వైద్య విద్యార్థులకు హెమటాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ పరికరాలు పూర్తి స్థాయిలో లేవు. దీంతో పాటు ఆపరేషన్ థియేటర్ లేదు. విద్యాబోధనకు పూర్తిస్థాయి అధ్యాపకులు, స్పెషలిస్టులు అందుబాటులో లేరు. వైద్య విద్యార్థులు రోగులను పరిశీలించేందుకు ములుగు ఏరియా ఆస్పత్రిని అనుసంధానంగా ఉంచారు. ప్రాక్టికల్‌గా మానవ శరీరాన్ని, అవయవాలను పరిశీలించేందుకు మృతదేహాలు అందుబాటులో లేవు. కృత్రిమ మానవ శరీరంలోని భాగాలను చూపిస్తూ విద్యాబోధన చేపడుతున్నారు.

నేడు తేలనున్న భవితవ్యం..

ప్రభుత్వ వైద్య కళాశాల భవితవ్యం నేడు (బుధవారం)తేలనుంది. గుర్తించిన లోపాలు, షోకాజ్ నోటీసులపై సంజాయిషీ ఇవ్వాలని, ఇందుకోసం బుధవారం ఢిల్లీకి రావాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈలను ఆదేశించింది. ఆ లోపాలను సరిచేస్తామని అన్ని కళాశాలలనుంచి హామీ పత్రాలు ఇవ్వనున్నారు. కానీ, వాటికి కూడా సంతృప్తి చెందక సీట్లు తగ్గిస్తారా? జరిమానాలు విధిస్తారా..? మందలించి వదిలేస్తారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా ఢిల్లీలో పూర్తి వివరాలు సమర్పించేందుకు అన్ని జిల్లాల, మెడికల్ కళాశాలల డీన్స్/ప్రిన్సిపాళ్లు, మెడికల్ సూపరింటెండెంట్లతో డీఎంఈ సోమవారం, మంగళవారంలలో సమావేశమై కళాశాలల సమగ్ర సమాచారం సేకరించారు.

అధ్యాపకుల అవసరం ఉంది..



జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో అధ్యాపకుల అవసరం ఉంది. ప్రస్తుతం కళాశాల, హాస్పిటల్‌లో మొత్తం 75 మంది అధ్యాపకులు ఉన్నారు. మరో 25మంది అవసరం ఉంది. మెడికల్ బోర్డుకు నివేదికలు అందించాం. కళాశాలలో విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు మృతదేహాలు అందుబాటులో లేవు. అందుకు కాకతీయ మెడికల్ కళాశాల నుంచి తెప్పించడంతో పాటు పోలీసులను ఆశ్రయించాం. ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కళాశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నారు.

- మోహన్‌లాల్, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల

నేర రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఎస్పీ శబరీశ్



మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు రూరల్: నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. మండల పరిధిలోని జాకారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన అభయ మిత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల భద్రత, భరోసాకు అభయ మిత్ర కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిడం వల్ల నేర రహిత సమాజ నిర్మాణం, పోలీసులకు, ప్రజలకు సత్సంబంధాలు పెంపొందుతాయన్నారు. నిషేధిత మాదకద్రవ్యాల వ్యతిరేఖ చట్టాలపై అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. తల్లితండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి, నకిలీ విత్తనాల అమ్మకాలపై సమాచారం అందించిన వారికి రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. మండల పరిధిలోని 32 పంచాయతీల్లో యాంటీ డ్రగ్ కమిటీలను నియమించినట్లు తెలిపారు. రైతులు అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు కరెంట్ ఫినిసింగ్ వేయకూడదని సూచించారు. యువత పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలతో ప్రేమ, శారీరక సంబంధాలు పెట్టుకోవడం నేరమని వివరించారు. సైబర్ క్రైం నేరస్తుల బారిన పడకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. నకిలీ విత్తనాల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ సురేష్, ఎస్సై వెంకటేశ్వర్లు, విలేజ్ పోలీస్ ఆఫీసర్లు, యాంటీ డ్రగ్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

సీడీపీఓ ప్రేమలత



మాట్లాడుతున్న సీడీపీఓ ప్రేమలత

ఏటూరునాగారం: బాల్య వివాహాల నిర్మూలనలో పంచాయతీ కార్యదర్శులు ప్రధాన పాత్ర పోషించాలని బాల్య వివాహ నిరోధక అధికారిణి, సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగము ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు బాల్యవివాహాల నిషేధ చట్టం – 2006 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగము అధికారి హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక సమాజంలో ఇప్పటికీ బాల్య వివాహాలు సవాల్‌గా మారాయన్నారు. మారుమూల ప్రాంతాల్లో వివిధ కారణాలతో బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ స్థాయిలో బాల్యవివాహ నిరోధక అధికారులుగా పంచాయతీ కార్యదర్శులు వ్యవహరించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాల నిర్మూలనలో పంచాయతీ కార్యదర్శులు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. బాల్య వివాహ రహిత జిల్లాగా ములుగును మార్చడమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీఓ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే వెంటనే ఆ ప్రదేశాన్ని సందర్శించి ఆపాలన్నారు. బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం –2006 ప్రకారం 18 ఏళ్లు నిండని అమ్మాయిలు, 21ఏళ్లు నిండని అబ్బాయిలకు వివాహం చేయడం చటరీత్యా నేరమన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా ఉంటుందన్నారు. బాల్య వివాహాలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్ 1098, 112లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీవిద్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీసీసీ సేవలను విస్తృతం చేయాలి

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



అధికారులతో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో గిరిజన సహకార సంఘం పరిధిలో గల ప్రజలకు అందుతున్న సేవలను మరింత విస్తృత పర్చాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జీసీసీ అధికారుల సమావేశంలో పీఓ మాట్లాడారు. జీసీసీ వాహనాల మరమ్మతులు ఇప్పటి వరకు ఎన్ని చేయించారని, ఇంకా ఎన్ని చేయించాల్సి ఉందని ఆరా తీశారు. మహదేవ్‌పూర్ సొసైటీకి చెందిన గ్యాస్‌గోదాం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్ డిపోలు, ఎంఎల్‌ఎస్ పాయింట్ల గోదాంలు, పెట్రోల్ బంక్‌ల తనిఖీలను మరింత ముమ్మరం చేయాలన్నారు. డీఆర్ డిపోల నిత్యావసర వస్తువుల కొనుగోళ్లు, లాభాలపై చర్చించారు. జీసీసీ గోదాంలు, ఆఫీసులు, డీఆర్ డిపోల స్థలాలను తనిఖీ చేసి గుర్తించాలన్నారు. ఆహార సదుపాయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సకాలంలో డీఆర్ డిపోలు, హాస్టళ్లకు సరఫరా అయ్యేలా చూడాలని, ఆహారం నిల్వలు గడువు ముగిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏటూరునాగారం డివిజన్ పరిధిలో పనిచేసే పెట్రోల్ బంక్‌లు దగ్గర తప్పకుండా సౌండ్‌బాక్సుల స్కానర్లను అమర్చాలన్నారు. బంక్‌లు, గోదాంల వద్ద బోరు సదుపాయం లేకపోతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం వాణి, మేనేజర్‌లు దేవ్, స్వామి, డీఈఓఎస్ అన్వర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం..

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



గుడిసెవాసులతో మాట్లాడుతున్న నాగజ్యోతి

ఏటూరునాగారం: అడవిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలను గుడిసెలు వదిలిపొమ్మనడం దారుణమని, ఆదివాసులకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల పరిధిలోని రొయ్యూరు సమీపంలోని ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను ఆమె మంగళవారం పరిశీలించారు. అటవీశాఖ అధికారులు గుడిసెలు కూల్చివేసేందుకు చేసిన ప్రయత్నాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవిపై ఆధారపడి జీవించే ఆదివాసులను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలో ఉండగానే అటవీశాఖ అధికారులు గుడిసెలను జేసీబీలతో కూల్చివేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆదివాసీలను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు ఇచ్చిన హామీలు మర్చిపోయారా అంటూ మంత్రి సీతక్కను ప్రశ్నించారు. అటవీశాఖ అధికారులు ఇలాంటి చర్యలు పునరావృతం చేస్తే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, దున్నపునేని కిరణ్, కాళ్ల రామకృష్ణ, కుమ్మరి చంద్రబాబు, చిన్ని కృష్ణ, చంద్రమౌళి, రాంబాబు, ఆదివాసీలు, తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన కుడా చైర్మన్

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని మంగళవారం వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి ఆయన పూజలు నిర్వహించగా ఆలయ పూజారి హరీశ్ శర్మ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు.



ఆలయ విశిష్టతను చైర్మన్‌కు వివరిస్తున్న గైడ్

పెట్టుబడి సాయం..

రైతు భరోసా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

- రైతుల ఖాతాల్లో జమ అవుతున్న డబ్బులు
- జిల్లాలో 61,666 మందికి రూ.48.47 కోట్ల సాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

వెంకటాపురం(ఎం): వానాకాలం సాగు ప్రారంభంలోనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో కర్షకుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా సాగు సమయానికే డబ్బులు అందుతుండడంతో రైతులు సంబరపడిపోతున్నారు. ఆన్‌లైన్‌లో భూ వివరాలు నమోదైన ప్రతీ ఒక్కరికి పెట్టుబడి సాయం అందనుంది. సోమవారం రెండెకరాల లోపు, మంగళవారం మూడున్నర ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ ప్రభుత్వం ఎకరానికి రూ.6వేల చొప్పున డబ్బులు జమ చేసింది. ప్రతిఏటా ఎకరానికి రూ.12వేల చొప్పున రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పంటల సాగును ప్రోత్సహిస్తోంది.

ఏడాదికి రూ.12వేలు..

రైతులు సాగు చేస్తున్న పంటలకు పెట్టుబడి సాయాన్ని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదటిసారిగా 2018 యాసంగి సీజన్‌కు ఎకరానికి రూ.4వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతులకు అందించింది. 2019లో తిరిగి రెండోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎకరానికి రూ. 5వేల చొప్పున రెండు పంటలకు పెట్టుబడి సాయాన్ని పెంచి రూ.10 వేలు అందించింది. 2023లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఏడాదికి రూ.12వేలకు పెంచి అన్నదాతకు భరోసా కల్పించింది.

మండలాల వారీగా ఖాతాల్లో జమ అయిన నిధులు

మండలం	రైతులు	నిధులు
ఏటూరునాగారం	5,344	4,11,42,084
గోవిందరావుపేట	5,146	4,48,05,368
కన్నాయిగూడెం	3,794	2,72,73,687
మంగపేట	6,809	6,27,57,450
ఎస్ఎస్‌తాడ్వాయి	4,946	4,22,88,890
వెంకటాపురం(కె)	6,176	4,66,01,333
వాజేడు	6,710	4,80,29,756
ములుగు	14,098	10,53,70,686
వెంకటాపురం(ఎం)	8,643	6,64,50,876

రూ.48.47 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



జిల్లాలోని 10 మండలాల పరిధిలో 85,990 మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తుండగా రైతు భరోసా పథకం కింద సుమారు రూ.103 కోట్లు ప్రభుత్వం అందించనుంది. సోమవారం రెండు ఎకరాలలోపు ఉన్న 49,356 మంది రైతులకు వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం రూ.30,10 కోట్లు రైతు ఖాతాల్లో జమ అయ్యాయి. మంగళవారం మూడున్నర ఎకరాలలోపు ఉన్న 12,310 మంది రైతులకు రూ.18.37 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. ఈ రెండు రోజుల్లో మూడున్నర ఎకరాలలోపు ఉన్న 61,666 మంది రైతులకు రూ.48.47 కోట్లను ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేసింది. ఈ నెల 25వ తేదీ వరకు విడతల వారీగా రైతులందరికీ రైతుభరోసా డబ్బులను ప్రభుత్వం అందజేయనుంది. జూన్ 5వ తేదీలోపు పాస్‌పుస్తకాలు కలిగిన ప్రతీ రైతుకు రైతు భరోసా వర్తింపజేస్తామని అధికారులు వెల్లడించారు.

డబ్బులు జమ అయ్యాయి



వానాకాలం సీజన్‌లో వ్యవసాయానికి పెట్టుబడి పెట్టే సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమచేయడం చాలా సంతోషంగా ఉంది. రెండు ఎకరాలకు రూ.12వేల రూపాయలు ఖాతాలో పడ్డాయి. రైతు భరోసా డబ్బులతో సాగు పనులు ప్రారంభించి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తాను. పెట్టుబడికి అప్పులు చేయకుండా రైతు భరోసాతో పెట్టుబడి సాయాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారు.

- చీకుర్తి రమేశ్, రైతు వెంకటాపురం(ఎం)

కొంతభారం తగ్గింది..



ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా డబ్బులతో కొంత మేలు జరుగుతుంది. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందడంతో పెట్టుబడికి అప్పులు చేయకుండా భారం తగ్గింది. ప్రభుత్వం అందిస్తున్న భరోసా డబ్బులు పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడతాయి. 26 గుంటల భూమికి రూ.3,900లు పెట్టుబడి సాయం ఖాతాలో జమ అయింది. సరైన సమయంలో పెట్టుబడి సాయాన్ని అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- మామిడిపెల్లి నీలమ్మ, మహిళా రైతు వెంకటాపురం(ఎం)

రైతు ఖాతాల్లో భరోసా నిధులు



రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 86,234 మంది రైతులకు 103 కోట్లు చెల్లించాల్సి ఉండగా 61,666 మందికి రూ.48 కోట్లు జమ అయ్యాయి. మిగతా రైతులకు వారం నుంచి పది రోజుల మధ్య రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ అవుతాయి.

- టీఎస్.దివాకర, కలెక్టర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్ఓ గోపాల్‌రావు



మాట్లాడుతున్న గోపాల్‌రావు

ములుగు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం కీటక జనిత వ్యాధుల నియంత్రణపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది మలేరియా, డెంగీ వ్యాధులు ఎక్కువగా నమోదైన గ్రామాలలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. సర్వే, యాంటీ లార్వా స్ప్రే, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ, నీటి నిల్వలపై మూతలు పెట్టడం, నీటి గుంటలలో ఆయిల్ బాల్స్ వేయడం లాంటి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాల్లో ఆంటీ లార్వా స్ప్రే చేయించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా పరీక్షలు నిర్వహించేందుకు మైక్రోస్కోప్ పనితీరును పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, శ్రీకాంత్, డెమో సంపత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



ఖిలా వరంగల్: తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 23 నుంచి జూలై 01వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాకేజీ -1 (గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర-ఎస్‌సీజెడ్ బీజీ 44) యాత్రలో కాశీ (వారణాసి), అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ రాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించొచ్చు. ఈయాత్ర జూన్ 23వ తేదీన ప్రారంభమై జూలై 01వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్ ధర రూ.16,200, థర్డ్ ఏసీ ధర రూ. 26,500, 2 ఏసీ ధర రూ. 35,000 ఉంటుంది. యాత్ర రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది. ప్రయాణికులకు రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిళ్లు, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శించొచ్చు. అదనపు ఖర్చులు ఏమి ఉండవు. ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయి.అలాగే, రైల్వే స్టేషన్ నుంచి దేవాలయం వరకు ప్రయాణం పూర్తిగా ఉచితం. టికెట్ బుక్ చేసుకోవాలనుకునే వారు వివరాలకు 9701360701 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

- మహిళ మృతి, ఇద్దరికి గాయాలు
- పాలకుర్తిలో ఘటన



చైతన్య మృతదేహం

పాలకుర్తి టౌన్: బైక్ (టీవీ ఎక్సెల్)ను బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన పండుగ చైతన్య(36) తనకున్న భూమిలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం మామ సోమయ్య, కూతురు ప్రవళికతో కలిసి బైక్‌పై పాలకుర్తి మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి బొలెరో ఢీకొనడంతో చైతన్య అక్కడికక్కడే మృతి చెందింది. సోమయ్య, ప్రవళికకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ పేర్కొన్నారు. మృతురాలి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, 2005లో చైతన్య భర్త కుమార్ ట్రాక్టర్ యాక్సిడెంట్‌లో మృతి చెందాడు.

ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం ఓకే

కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదం

- ఇప్పుడే పదోన్నతులకు మాత్రం నో..
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 15 ఎకరాలు కేటాయింపు
- ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్ ఎత్తివేతకు ససేమిరా



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (సర్కారు) తీసుకున్న సానుకూల నిర్ణయంపై కేయూ పాలకమండలి సమావేశం చర్చించి ఆమోదించింది. దీంతో ఎట్టకేలకు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఊరట లభించింది. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఈఏడాది ఫిబ్రవరి 24న అప్పటి సీఎస్‌ను ఆదేశించిన విషయం విదితమే. దీంతో ప్రభుత్వం ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై సానుకూల నిర్ణయం తీసుకుని ఈఏడాది మే 8న ఆ జీఓను కాకతీయ యూనవర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపింది. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆ జీఓపై చర్చించి ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాన్ని ఆమోదించారు. కాగా, 15 సంవత్సరాలుగా ఉద్యోగంలో కొనసాగుతున్నా వీరి నియామకంపై వివాదాల నేపథ్యంలో వీరికి క్యాస్ పదోన్నతులు కల్పించలేదు. అయితే వీరికి పదోన్నతులు చర్చకు రాగా ఇప్పుడే కల్పించొద్దని నిర్ణయించారని తెలిసింది. దీంతో వీరు పదోన్నతుల కోసం కొంతకాలం వేచిచూడకతప్పదు.

యంగ్ఇండియా స్కూల్ కేయూ భూమిలోనే..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 200కోట్లతో నిర్మాణం చేయాల్సింటుంది. అయితే ఈ నియోజకవర్గంలో ఒకే చోట ప్రభుత్వం భూమి 15 నుంచి 20 ఎకరాల వరకు లభించే పరిస్థితి లేదని సమాచారం . ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేయూలో 15 ఎకరాల భూమి కేటాయించే అంశంపై కూడా యూనివర్సిటీ అధికారులు ఏజెండాలో పెట్టగా చర్చించి పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం.

స్నాతకోత్సవ నిర్వహణ వ్యయానికి ఓకే..

జూలై 7న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహించబోతున్నారు.అయితే విద్యార్థులకు ఇచ్చే గోల్డ్ మెడల్స్‌పై తొలుత ఫైనాన్స్ కమిటీలో, ఆ తర్వాత పాలకమండలిలో కూడా చర్చ జరిగింది. గోల్డ్‌మెడల్స్ పొందే విద్యార్థులు చాలా మంది ఉన్నారు. ప్రస్తుతం గోల్డ్‌ధర పెరిగినా మెడల్స్ ప్రదానం చేయాల్సిందే. అందుకయ్యే వ్యయానికి తొలుత ఫైనాన్స్ కమిటీలో, ఆ తర్వాత పాలకమండలి సమావేశంలో ఆమోదం లభించింది. స్నాతకోత్సవానికి గవర్నర్ కూడా రానున్నారు. దీంతో స్నాతకోత్సవ నిర్వహణ వ్యయానికి సంబంధించి అంశం ఓకే అయ్యింది.

రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకంపై చర్చ..

కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్న పోస్టులను మినహాయించి మిగితా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల వెకెన్సీల్లో రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకం చేపట్టాలనే అంశం కూడా పాలకమండలి సమావేశంలో చర్చించారని సమాచారం. అందుకు పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం.

ఆ ఇద్దరి సస్పెన్షన్ ఎత్తివేతకు నో..

కేయూ భూమిలో ఓ సర్వే నంబర్‌లో ఇల్లు కలిగి ఉన్నారని, ఇంకా పలు ఆరోపణలతో కొన్నినెలల క్రితం సస్పెన్షన్‌కు గురైన ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఎత్తివేత అంశం చర్చకు వచ్చింది. అయితే అతను ఇప్పటికే కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ ఎత్తివేతకు పాలకమండలి సమావేశం నో చెప్పింది. మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంవత్సరంన్నర క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.అతడిని అప్పట్లోనే యూనివర్సిటీ అధికారులు సస్పెన్షన్ చేశారు. అతడి సస్పెన్షన్ ఎత్తివేతపై పాలకమండలిలో చర్చకురాగా సస్పెన్షన్ ఎత్తివేతకు నో చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఇద్దరికి ఇప్పట్లో ఊరట లభించే అవకాశం కనిపించడం లేదు. ఈ పాలకమండలి సమావేశంలో కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, ఉన్నత విద్యాకమిషనర్ శ్రీదేవసేన, ఫైనాన్స్‌జాయింట్ సెక్రటరీ సుజాత, కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, కేయూ పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేశ్‌లాల్, డాక్టర్ కె. అనితారెడ్డి, పుల్లూరు సుధాకర్, సుకుమారి, ఎం. నవీన్, డాక్టర్ రమ, డాక్టర్ ఎస్ సుదర్శన్, డాక్టర్ చిర్రరాజు, బాలుచౌహాన్ పాల్గొన్నారు.

ఇల్లు లేని కుటుంబం ఉండొద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ ఎంపీ కడియం కావ్య



ప్రజాసభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సంక్షేమంలో వెనుకంజ వేసేది లేదు

- రైతుల కోసం ఏటా రూ. 70 వేల కోట్లు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పది రోజుల్లో భూపాలపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు
- ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

భూపాలపల్లి : రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా, ఆదాయం లేకుండా ఇబ్బంది పడకుండా చూడడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం చెన్నాపూర్‌లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, కుందూరుపల్లి వద్ద సెంట్రల్ లైటింగ్ పనులను డిప్యూటీ సీఎం మంగళవారం ప్రారంభించారు. అనంతరం మంజూర్‌నగర్‌లో మంజూర్‌నగర్, గణపురం మండలం ధర్మారావుపేట, చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాసభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పదేళ్ల పాలించిన వారు ప్రతీ రూపాయి దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, జీవన ప్రమాణాలు పెరగలేదన్నారు. రైతుల సంక్షేమం కోసం ఏటా ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ఐదేళ్ల కాలంలో రూ. 3.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నామన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఇప్పటివరకు ప్రభుత్వం రూ. 16 వేల కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లించిందన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య నందించేందుకు మొదటి దశలో 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ. 11,500 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరిక మేరకు జిల్లాలోని కొత్త మండలాల్లో ఎన్పీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్‌లు, జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ స్టోర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, దుబ్బపల్లి, పరశురాంపల్లి గ్రామాల్లో భూసేకరణ చేపట్టాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు సూచించారు. అనంతరం భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ -2ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి సింగరేణి ప్రాజెక్టుల ఏర్పాటు, బొగ్గు ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైల్వే లైన్ తీసుకొస్తా..

సింగరేణి, కేటీపీపీ పరిశ్రమలు ఉన్న భూపాలపల్లికి రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఇక్కడ జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

పది రోజుల్లో టాస్క్ సెంటర్..

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పది రోజుల్లో భూపాలపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి జిల్లాకు చుక్క నీరు రాలేదని, అయినా అప్పటి భూపాలపల్లి ప్రజాప్రతినిధి, మంథని బీఆర్‌ఎస్ నాయకుడు నోరు మూసుకుని ఉన్నారన్నారు. భూపాలపల్లి జిల్లాలో 47,200 ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

800 మెగావాట్ల ప్లాంటు మంజూరు చేయాలి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో భూపాలపల్లిలో 500, 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించారని, ఇక్కడ బొగ్గు, నీరు పుష్కలంగా ఉన్నాయని, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. సింగరేణి, కేటీపీపీలో స్థానికులు, భూ నిర్వాసితులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సింగరేణి సీఎండీ బలరాంనాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎన్పీడీసీఎల్ సీఈ రాజు చౌహాన్, ఎస్‌ఈ మల్సూర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాటన్ అసోసియేషన్ బాధ్యులు

న్యూశాయంపేట: తెలంగాణలో పత్తి రైతు అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాటన్ కార్పొరేషన్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్ గుప్తా, సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయసేనా, సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీపాణిగ్రహి తదితరులను ముంబాయిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం నుంచి 40లక్షల బేళ్ల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసి రైతులకు మూడురోజుల్లో డబ్బులు చెల్లించిన నేపథ్యంలో చైర్మన్, తదితరులను సన్మానించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధంగా సహకరించాలని ఆయన కోరారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కేయూ క్యాంపస్: టీజీఈసెట్ అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎం రెహమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి పరామర్శ



సత్యవతి రాథోడ్‌ను పరామర్శిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ

మహబూబాబాద్/కురవి: ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను హైదరాబాద్ సోమాజిగూడలోని తన నివాసంలో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు.

కంచ కట్టయ్య జీవితం ఆదర్శం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కంచ కట్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నర్సంపేట: మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం నింపిన కంచ కట్టయ్య (సైన్స్ మనిషి..బిరుదు) జీవితం ఆదర్శమని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు, సైన్స్ శాస్త్రవేత్త కంచ కట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కంచ కట్టయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు వీడి కంచ కట్టయ్య జీవితాన్ని ఆదర్శం తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ వీరన్నయాదవ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులు సుభాశ్, కంపాటి వీరయ్య, ఓయూ జేఏసీ నాయకులు కొంగళపాండు కురుమ, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నడి రమేశ్, వెంకట్‌నాయక్, మేకల శివ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో నియోజకవర్గ అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసా వంటి పథకాల అమలుపై మంత్రి ప్రభాకర్ చర్చించారు.

బీపీఈడీలో రైతుబిడ్డకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

- క్రీడల్లో ప్రతిభ కనబర్చిన జ్యోతిర్మయి
- తల్లిదండ్రులు, గ్రామస్తుల హర్షం



జ్యోతిర్మయి

ఏటూరునాగారం: బీపీఈడీలో రైతుబిడ్డ సత్తా చాటింది. టీజీ పీఈసీఈటీ-2025 ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరుకు చెందిన రైతు రామయ్య, కుమారి దంపతుల కూతురు జ్యోతిర్మయి ఈ నెల 13వ తేదీన టీజీ పీఈసీఈటీ-2025 (తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) రాసింది. ఈ క్రమంలో మంగళవారం విడుదలైన ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో తల్లిదండ్రులు రామయ్య, కుమారి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, జ్యోతిర్మయి రొయ్యూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ 5వ తరగతిలో రాయపర్తి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో సీటు సాధించింది. ఐదు నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకుంది. అయితే క్రీడలపై మక్కువతో 9వ తరగతిలో రంగారెడ్డి జిల్లా కమ్మదను సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ అకాడమీలో కోచ్ హబీబ్ హుస్సేన్ వద్ద శిక్షణ తీసుకుంది. అనంతరం పాలమూరు యూనివర్సిటీ డిగ్రీ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల బీపీఈడీ (వ్యాయామ) ప్రవేశ పరీక్ష రాసింది. ఇందులో స్టేట్ ర్యాంక్‌ను సాధించింది. కాగా, బీపీఈడీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు సంతోషంగా ఉందని జ్యోతిర్మయి తెలిపింది.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు బాలకార్మికుడు బలి..

- నిద్రిస్తున్న బాలుడిపై నుంచి వెళ్లిన బోరువాహనం
- అక్కడికక్కడే మృతి.. మిర్యాలపెంట సమీపంలో ఘటన



హిడ్మా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

బయ్యారం: నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ బాలకార్మికుడిని బలి తీసుకుంది. బాలుడిని పనిలో పెట్టుకోవడమే నేరం కాగా అలసిపోయి నిద్రిస్తున్న ఆ చిన్నారిపై నుంచి బోరువాహనం వెళ్లడంతో నిద్రలోనే అనంత లోకాలకు వెళ్లాడు. ఈ హృదయవిదారకర ఘటన మంగళవారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన ధారావత్ భాస్కర్ బోరువాహనంపై పని చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా నీలవరం గ్రామానికి చెందిన కబాతి హిడ్మా(14) పదిరోజుల క్రితం మేనమామ సుక్కతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో బయ్యారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో బోరువేస్తుండగా హిడ్మా ఆ వాహనం కింద నిద్రపోయాడు. ఇది గమనించకుండా వాహన డ్రైవర్ భూక్య భాస్కర్ వెనకకు తిప్పడంతో హిడ్మా తలపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ సుక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

- ఇస్రా తండాలో ఘటన



రంగమ్మ మృతదేహం

నెల్లికుదురు: మద్యం మత్తులో భర్త క్షణికావేశంలో భార్యను హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం హేమ్లాతండా శివారు ఇస్రా తండాలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం. తండాకు చెందిన బానోత్ భద్రు, రంగమ్మ (55) దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా గొడవ జరిగింది. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న భద్రు క్షణికావేశంలో రంగమ్మను గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం క్షణికావేశంలో తానే హత్య చేశానని తండావాసుల ముందు ఒప్పుకున్నాడు. ఈ ఘటనపై మృతురాలి కూతురు వాంకుడోతు శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశ రక్షణ కోసం యువతను సిద్ధం చేయాలి

- తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలాని
- వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ సందర్శన



వరంగల్, ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ అధికారులతో నర్సింగ్ సైలాని

కాజీపేట రూరల్/మామునూరు/విద్యారణ్యపురి : దేశ రక్షణ కోసం యువతను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సైలానికి వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ నింబాకర్ వీరచక్ర స్వాగతం పలికారు. రెండు రాష్ట్రాల బాధ్యతలు చేపట్టిన నర్సింగ్ సైలాని గ్రూప్‌హెడ్‌క్వార్టర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఎన్‌సీసీ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశ రక్షణ రక్షణ కోసం యువత సైన్యంలో పాల్గొనేలా సన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రూప్ శిక్షణ విధానాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ పద్ధతులు, క్యాంప్ నిర్వహణ, పరిపాలన విధానాలు చూసి అభినందించారు. ఎక్సైజ్‌కాలనీలోని ఆర్మీ మెస్‌కు వెళ్లి అక్కడ జవాన్లతో కలిసి భోజనం చేశారు. అనంతరం 10వ తెలంగాణ బెటాలియన్, 1వ తెలంగాణ బెటాలియన్, 4వ ఎయిర్ ఫోర్స్ బెటాలియన్, మామునూరు పీటీసీ క్యాంప్‌ను సందర్శించారు. కాగా, నర్సింగ్ సైలాని బుధవారం ఖమ్మం బెటాలియన్‌ను సందర్శిస్తారని గ్రూప్ కమాండర్ సచిన్ నింబాకర్ తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు రాహుల్ సింగ్, ఎస్ఎం. రియాజ్, కల్నల్ పిప్పి కిశోర్, కల్నల్ ఎస్.ఎస్.రామదురై, విజయ్‌కుమార్, 'టి' వింగ్ కమాండర్ ఆశీష్ భాస్కర్, 'డి' వింగ్ కమాండర్ వి.కె.ఆర్య, కల్నల్ రవీంద్రకుమార్, లెఫ్టినెంట్ రవి సునారి, కల్నల్ సంజయ్‌కుమార్, కల్నల్ నవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో రాణిస్తే భవిష్యత్..

క్రమశిక్షణ, సామాజిక సేవభావంతో ఎన్‌సీసీలో రాణిస్తే క్యాడెట్‌కు భవిష్యత్ ఉంటుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని పోలీసు శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 8వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం పదోరోజుకు చేరుకుంది. క్యాడెట్లకు బ్యాలెన్స్ జంప్, వాల్‌జంప్, రన్నింగ్, డ్రిల్, మాప్‌రీడింగ్,ఫైరింగ్, ఆయుధ శిక్షణ ఇచ్చారు. నర్సింగ్ సైలాని ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. సమావేశంలో 8వ బెటాలియన్ కమొడర్ కల్నల్ రవీంద్రకుమార్, 615మంది క్యాడెట్లు పాల్గొన్నారు.